



మూసివేసిన మూడో ప్రవేశ ద్వారం

సీపీఎస్‌పైనా చేతులెత్తేశారు!



అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో రద్దు చేస్తానని పాదయాత్రలో జగన్ హామీ

నాలుగేళ్లపాటు నాన్చి... చివరకు సాధ్యం కాదని ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం

- కొత్తగా జీపీఎస్ విధానం
- నమ్మించి దగా చేశారని ఉద్యోగుల మండిపాటు
- జీపీఎస్ పేరుతో మరింత నష్టం తలపెట్టారంటూ ఆగ్రహం
- ఉమ్మడి జిల్లాలో సీపీఎస్ ఉద్యోగులు 30 వేల మంది



పాదయాత్రలో సీపీఎస్ ఉద్యోగులతో జగన్ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలో పనిచేసే ఉద్యోగులను సీఎం జగన్మోహన్‌రెడ్డి నిలువునా మోసం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష నేతగా చేసిన పాదయాత్రలో 'సీపీఎస్ రద్దు ఎంతసేపు... అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో చేస్తానన్న' అంటూ కొండంత హామీ ఇచ్చి... తీరా అధికారం చేపట్టిన తరువాత నాలుగేళ్లు నాన్చి, నాలుక మడతేశారు. చివరకు సీపీఎస్ రద్దు చేయలేనని... అంతకంటే గొప్ప పథకం అంటూ గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తీసుకువచ్చారు. దీనిపై ఉద్యోగులు భగ్గుమంటున్నారు.



కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్న చందంగా మారింది రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగుల పరిస్థితి. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని పాదయాత్రలో జగన్ హామీ ఇవ్వడంతో మెజారిటీ ఉద్యోగులు గత ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా నిలిచారు. తీరా అధికారం చేపట్టాక నాలుగేళ్లు దానిపై మాట్లాడకుండా మౌనం దాల్చి... తీరిగ్గా రద్దు సాధ్యం కాదని తేల్చేసి...అంతకంటే మంచిదంటూ జీపీఎస్‌ను తెరపైకి తీసుకురావడంతో ఉద్యోగులంతా మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓపీఎస్ (పాత పింఛన్ విధానం) అమలే ఎజెండాగా ఉద్యమిస్తామంటున్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేశారు. అంటే ఆ తరువాత ప్రభుత్వ సర్వీసుల్లో చేరిన ఉద్యోగులకు సీపీఎస్ మేరకు పింఛన్ అందుతుంది. అంతకుముందు ఉద్యోగంలో చేరిన వారందరికీ పాత విధానం మేరకు పింఛన్‌తోపాటు ఆరోగ్య కార్డులు, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో సీపీఎస్‌పై ఉద్యోగులు ఆందోళనలకు దిగారు. ప్రతి ప్రభుత్వ హయాంలో పోరాటాలు చేశారు. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఇస్తామని 2014లో చంద్రబాబు భరోసా ఇచ్చినా ఉద్యోగులు మాత్రం 'సీపీఎస్' రద్దు తప్ప మరో మాటలేదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగుల సంఖ్య లక్షలకు చేరడంతో నిరసన స్వరం పెరిగింది.

పాదయాత్రలో మోసపూరిత హామీ

కాగా 2018లో పాదయాత్ర చేపట్టిన అప్పటి విపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇవ్వడంతో ఉద్యోగులంతా అతని అడుగులో అడుగువేసి పాదయాత్రలో వినతిపత్రాలు ఇచ్చి నీరాజనాలు పలికారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయంలో కీలకభూమిక పోషించారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత సీపీఎస్ రద్దుపై కేబినెట్‌లో చర్చించి కమిటీ వేశారు. తరువాత మరో రెండు కమిటీలు వేసినా రద్దు మాట మరిచిపోయారు. ఈ క్రమంలో ఉద్యోగులు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. అయితే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులతో వైసీపీ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నించినపుడే జగన్‌పై తమకు నమ్మకం పోయిందని ఆనందపురం మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు వ్యాఖ్యానించారు. సీపీఎస్ రద్దు మాట దేవుడెరుగు... సామాజిక మాధ్యమాల్లో వైసీపీ మూకలు తమపై విషం కక్కడం మరింత ఆవేదన కలిగించిందన్నారు. మంత్రులు, అధికారులతో పలు దఫాలు చర్చలు జరిపినా ఓపీఎస్ అమలు తప్ప మరేదైనా కోరుకోవాలనడం మోసం చేయడమేనని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి ఒకరు దుయ్యబట్టారు. చివరకు జీపీఎస్ అంటూ ఉద్యోగులకు నష్టం చేసేలా ఓ పథకాన్ని ... మిగతా 8వ పేజీలో

రైల్వే స్టేషన్‌లో కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

మరమ్మతులు ప్రారంభించిన అధికారులు

- మూడో ప్రవేశద్వారం మూసివేత
- బ్రిడ్జి పనులు పూర్తయ్యేంత వరకూ ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు ఉపయోగించుకోవాల్సిందిగా అధికారుల సూచన
- హెల్ప్ డెస్క్ ఏర్పాటు

3, 4 ప్లాట్‌ఫారాల మధ్య కుంగిన బ్రిడ్జి



విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం ఉదయం ఆకస్మికంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగిపోయింది. ఈ విషయం గమనించిన అధికారులు వెంటనే దానిపై రాకపోకలు నిలిపివేశారు. రైల్వేస్టేషన్ లోపలకు వెళ్లేందుకు ముఖ ద్వారం వైపు మూడు మార్గాలు ఉన్నాయి. ఒకటి ప్రధాన ద్వారం కాగా, ఫుడ్ కోర్టు వద్ద రెండోది, ద్విచక్ర వాహనాల పార్కింగ్ పక్కనే (దక్షిణం వైపు) మూడో నంబరు గేటు ఉంటుంది. ప్రయాణికుల్లో అత్యధికులు దీనినే ఉపయోగిస్తారు. ఆటోలు కూడా అక్కడే ఆగుతాయి. ఆ మార్గంలో వివిధ ప్లాట్‌ఫారాలకు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉంది. అది సోమవారం ఉదయం ఆకస్మికంగా 3, 4 ప్లాట్‌ఫారాల మధ్య కుంగిపోయింది. ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని 1990 ప్రాంతంలో నిర్మించారు. ఇది పూర్తిగా ఇనుముతో నిర్మించినది. ప్రతి మూడేళ్లకు ఓసారి నిర్వహణ పనులు చేస్తుంటారు. ప్రస్తుతం వారం రోజులుగా రంగులు వేసే పనులు జరుగుతున్నాయి. అయితే మూడు, నాలుగు ప్లాట్‌ఫారాల మధ్య ఇనుప స్తంభాలు కొన్ని తుప్పు పట్టడంతో పైనున్న బ్రిడ్జి కిందికి కుంగిపోయింది. ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే అధికారులు ఆ మార్గంలో రాకపోకలు నిషేధించారు. మూడు, నాలుగు ప్లాట్‌ఫారాలపైకి రైళ్లు రాకుండా వేరే ప్లాట్‌ఫారాల పైకి మళ్లిస్తున్నారు. విశాఖపట్నం స్టేషన్‌కు రోజూ 120 ప్రయాణికుల రైళ్లు వచ్చి వెళుతుంటాయి. స్టేషన్‌లో మొత్తం ఎనిమిది ప్లాట్‌ఫారాలు ఉండగా, మూడు, నాలుగు ప్లాట్ ఫారాలపైకి సుమారుగా 30 రైళ్లు వచ్చి వెళతాయి. వాటన్నింటినీ సోమవారం ఇతర ప్లాట్‌ఫారాలపైకి సర్దుబాటు చేశారు. దాంతో పలు రైళ్లను దువ్వాడ, కంచరపాలెం, కొత్తవలస, ఇలా శివార్లలోని స్టేషన్ల వద్ద కొద్ది సేపు నిలిపివేసి, ప్లాట్‌ఫారం ఖాళీ అయ్యాక పంపుతున్నారు. దాంతో రైళ్లు గంట నుంచి రెండు గంటలు వరకు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి కుంగినందున రైల్వేస్టేషన్‌లో దక్షిణం వైపు ఉన్న ప్రవేశ ద్వారాన్ని తాత్కాలికంగా అధికారులు మూసివేశారు. ప్రయాణికులు స్టేషన్‌లోపలకు వెళ్లేందుకు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు.



ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై టైల్స్ తొలగిస్తున్న దృశ్యం

యుద్ధప్రాతిపదికన పనులు

సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి, యథాతథా స్థితి కల్పించడానికి డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ తక్షణ చర్యలు చేపట్టారు. క్రేన్లు రప్పించి, పదుల సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులను పెట్టి ... మిగతా 8వ పేజీలో

సీఎస్ఆర్ నిధులతో హాస్టళ్ల ఆధునికీకరణ

- నాడు-నేడులో చేస్తామని చెప్పి విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం
- కార్పొరేట్ సంస్థలు అందించిన నిధులతో పనులు

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

'నాడు-నేడు'లో భాగంగా జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లను కూడా ఆధునికీకరిస్తామని చెప్పిన జగన్ సర్కారు ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించింది. అయితే, అనేక వసతి గృహాలు అధ్వానంగా ఉండడంతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టిసారించారు. పలు పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్)లో భాగంగా అందించిన నిధులతో పలు వసతి గృహాలను ... మిగతా 8వ పేజీలో

ముగిసిన టెన్త్ మూల్యాంకనం

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారంతో ముగిసింది. ఈనెల ఒకటో తేదీన జ్ఞానాపురం జూబ్లీ హైస్కూలులో మూల్యాంకనం ప్రారంభమైంది. ఎనిమిది రోజుల్లో మొత్తం 1,76,924 జవాబుపత్రాలను మూల్యాంకనం చేశారు. అత్యధికంగా ఇంగ్లీష్ సబ్జక్టుకు సంబంధించి 29 వేలు, సోషల్ స్టడీస్‌లో 28 వేలు జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయి. మూల్యాంకనం కోసం 104 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 624 మంది అసిస్టెంట్ ఎగ్జామి నర్లు, 208 మంది సహాయకులు విధులు నిర్వహించారు. వీరికి అదనంగా మరికొందరు ఉద్యోగులు, టీచర్లు పాల్గొన్నారు. మూల్యాంకనం పర్యవేక్షణకు రాష్ట్ర పరిశీలకులుగా పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీ విజయభాస్కర్ వ్యవహరించగా, క్యాంపు అధికారిగా డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ క్యాంపు అధికారులుగా డిప్యూటీ డీఈవో గౌరీశంకర రావు, సీనియర్ లెక్చరర్ మాణిక్యంనాయుడు, పరీక్షల విభాగం అసిస్టెంట్ మురళీమోహన్ కొనసాగారు. మూల్యాం కనం ప్రశాంతంగా ముగిసిందని డీఈవో తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.15
సహారి (బుధ)	4.28

ఉగాది ఉత్సాహం



30లోగా పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

- జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 8:

ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను (2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి)ను ఏప్రిల్ 30వ తేదీలోగా ఒకేసారి చెల్లించి ఐదు శాతం రాయితీ (ఎర్లీ బర్డ్ ఆఫర్) పొందాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సౌకర్యం కేంద్రం, జోనల్ కార్యాలయాల్లోని సౌకర్యం కేంద్రాలు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకూ పనిచేస్తాయని, ఆదివారం/ఇతర సెలవు దినాలలో కూడా తెరిచి ఉంటాయని ఆయన తెలిపారు. అంతేకాకుండా జీవీఎంసీ వెబ్‌సైట్ gvmc.gov.in-property tax-bharat QR code ద్వారా, జీవీఎంసీ సౌకర్యం కేంద్రం, ఇంకా ఎంపిక చేసిన బ్యాంకులు,అన్ని సచివాలయాలలోనూ నగదు/డీడీ/డెబిట్/క్రెడిట్‌కార్డు ద్వారాపన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చునని కమిషనర్ తెలియజేశారు.

ఉక్కు ఉద్యోగులకు సగం జీతాలు చెల్లింపు

- మిగిలిన సగం కూడా త్వరగా చెల్లించాలని కోరుతున్న కార్మిక సంఘాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

విశాఖ ఉక్కు కర్మాగారం ఉద్యోగులకు యాజమాన్యం మార్చి నెలకు సంబంధించిన జీతాలు సగం మాత్రమే ఇచ్చింది. ఉగాది పండుగ కావడంతో గుర్తింపు యూనియన్ ప్రతినిధులు యాజమాన్యంతో చర్చించి, ఎంతో కొంత ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో 50 శాతం మాత్రమే ఇవ్వగలమని, మిగిలిన జీతం తరువాత సర్దుబాటు చేస్తామని చెప్పి సోమవారం సాయంత్రానికి అందరి బ్యాంకు ఖాతాల్లో సగం జీతాలు జమ చేశారు. ఎగ్జిక్యూటివ్‌లు, నాన్ ఎగ్జిక్యూటివ్ అధికారులు, కార్మికులు అందరికీ కలిసి రూ.100 కోట్ల వరకు జీతాలుగా చెల్లించాల్సి ఉంది. అందులో సోమవారం రూ.50 కోట్లు విడుదల చేశారు. మిగిలిన మొత్తం కూడా వారం రోజుల్లో ఇవ్వాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

కలెక్టరేట్‌కు ఉద్యోగులు క్యూ

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వినతులు

- తలలు పట్టుకుంటున్న అధికారులు
- అనారోగ్యమంటూ సమర్పిస్తున్న రిపోర్టుల పరిశీలనకు వైద్యులతో కూడిన కమిటీ నియామకం
- తప్పుడు పత్రాలు సమర్పిస్తే చర్యలు
- నిబంధనల ప్రకారం ప్రసూతి సెలవుల్లో ఉన్నవారికి, తీవ్రమైన అనారోగ్యానికి గురైన, మే నెలాఖరులోగా పదవీ విరమణ చేస్తున్న వారికి మాత్రమే వెసులుబాటు

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరేందుకు ఉద్యోగులు కలెక్టరేట్‌కు క్యూ కడుతున్నారు. కొందరు అనారోగ్య కారణాలను చూపు తుండగా, మరికొందరు జూన్/జూలై నెలల్లో తాము రిటై రవుతున్నందున డ్యూటీ నుంచి తప్పించాలని వినతిప త్రాలు సమర్పిస్తున్నారు. అధికారులు మాత్రం నిబంధనల మేరకు ఉన్న వినతులను తీసుకుని మిగిలిన వాటిని తిరస్కరిస్తున్నారు.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1991 (1941 పోలింగ్ బూత్‌లు, 50 అనుబంధ బూత్‌లు) పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటిలో ఎన్నికల విధులకు 13,500 మంది సిబ్బంది అవసరం. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం మరో 20 శాతం మందిని రిజర్వులో ఉంచుకోవాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కేంద్ర ప్రభుత్వ, బ్యాంకు ఉద్యోగులు, అధికారులను కూడా ఎన్నికల నిర్వహణకు వినియోగించుకోవాలని అధికారులు నిర్ణయించారు. ప్రతి శాఖ నుంచి ... మిగతా 8వ పేజీలో



కలెక్టరేట్‌లో ఎన్నికల నోడల్ అధికారి వద్ద వినతులు ఇస్తున్న ఉద్యోగులు

వైసీపీ సేవలో యూసీడీ


పార్టీ కార్యక్రమాల్లో ఆర్పీలు పాల్గొంటున్నా నిరోధించని వైనం

డ్వాక్రా సభ్యుల ఓటరు ఐడీ వివరాలు పంపాలని తాజాగా ఆదేశం

- అదే పనిలో ఆర్పీలు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

జీవీఎంసీలో అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగం అధికార పార్టీ వైసీపీకి అనుకూలంగా పనిచేస్తోంది. నగరంలో ఎక్కడ వైసీపీ సమావేశం జరిగినా రిసోర్స్ పర్సన్ల (ఆర్పీలు) ద్వారా డ్వాక్రా సభ్యులను వందల సంఖ్యలో అక్కడకు తరలిస్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో ఆర్పీలు ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారం చేస్తున్నారు. రాజకీయ నాయకులతో పాటు వేదికలు ఎక్కి కూర్చుంటున్నారు.



ఆర్పీలకు సీఓల నుంచి వచ్చిన నమూనా

యూసీడీ విభాగాన్ని వైసీపీ పార్టీలో ఒక భాగంగా భావిస్తోంది. అందుకు తగ్గట్టుగానే తాజాగా పీడీ కార్యాలయం నుంచి కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓలు) అందరికీ కొత్త ఆదేశాలు వచ్చాయి. ఆర్పీల పరిధిలో ఎంతమంది డ్వాక్రా సభ్యులు ఉన్నారో వారి వివరాలన్నీ రెండు రోజుల్లో ప్రధాన కార్యాలయానికి పంపాలన్నది సదరు ఆదేశాల సారాంశం. డ్వాక్రా సభ్యురాలి పూర్తి పేరు (ఇంటి పేరుతో సహా), మొబైల్ నంబరు, ఓటర్ ఐడీ నంబరు సవివరంగా రాసి పంపాలని నమూనా పంపించారు. ఈ వివరాలన్నీ తెలుగులో రాయవద్దని, పూర్తిగా ఇంగ్లీష్‌లోనే ఉండాలని ప్రత్యేకంగా సూచించారు. అడిగిన వెంటనే చాలామంది ఆర్పీలు ఆ వివరాలు పంపించేశారని, మిగిలిన వారు కూడా త్వరగా పంపాలని సీఓలు గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారు.

ఓటరు ఐడీలతో ఏం పని?

యూసీడీ విభాగానికి డ్వాక్రా సభ్యుల ఓటరు ఐడీతో పని ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొంతమంది సభ్యులు ఇదే విషయాన్ని ఆర్పీలను ప్రశ్నిస్తున్నారు. మీఓటరు కార్డు ఇవ్వండని ఆర్పీలు అడిగితే..'అది మీకు ఎందుకు చూపించాలి ?' అని కొందరు ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఆర్పీ చెప్పిన మాట వినకపోతే మళ్లీ రుణసాయం అదీ ఆపేస్తున్నారని కొందరు ఓటరు కార్డు అడిగిన వెంటనే ఇస్తున్నారు.

ఎన్నికల సంఘం స్పందించాలి

ప్రభుత్వం ఆదేశం లేకుండా ఓటర్ల వివరాలను ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ పనివారు సేకరించకూడదని, అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించాల్సి ఉంది. ఇళ్లకు ఎవరైనా వచ్చే వ్యక్తిగత వివరాలు అడిగితే ఇవ్వవద్దని కూడా ప్రచారం చేయాల్సి ఉంది. ప్రజల వ్యక్తిగత డేటాను ఉద్యోగులే సేకరించి, ఇలా రాజకీయ పార్టీలకు ఇవ్వడంపై స్పందించాల్సిన అవసరం ఉందని డ్వాక్రా సభ్యులు సూచిస్తున్నారు.

పూర్ణామార్కెట్‌లో అడ్డగోలుగా ఆశీలు వసూలు?

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 8: పూర్ణామార్కెట్‌లో ఆశీలు దందాకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఇటీవల వరకు ఆశీలు కాంట్రాక్టర్‌తో ఇబ్బందులు ఎదుర్కొన్న చిరు వ్యాపారులకు ఇప్పుడు జీవీఎంసీ సచివాలయ ఉద్యోగుల నుంచి ఇదే తరహా వేధింపులు ఎదురవుతున్నాయి. ఉగాది పండగ నేపథ్యంలో సోమవారం 206, 207 సచివాలయాల సిబ్బంది చిరువ్యాపారుల నుంచి అధిక మొత్తం ఆశీలు వసూలుచేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డుపై తట్టలతో వ్యాపారాలు సాగించే వారి నుంచి ఆశీలు యాక్టు ప్రకారం రూ. 5 వసూలు చేయాల్సిఉండగా, సచివాలయం సిబ్బంది రూ. 50 వరకు వసూలు చేసినట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి అధిక వసూలును కట్టడిచేయాలని వ్యాపారులుకోరుతున్నారు.









వైభవంగా నూకాలమ్మ ప్రధాన పండగ

మాధవధార, ఏప్రిల్ 8 ; భక్తుల నామ స్మరణలతో సోమవారం బర్మాక్యాంప్ శ్రీ నూకాంబిక దేవస్థానం జన సందోహంగా మారింది. వేకువ జామునుంచి అమ్మవారి దర్శనాలకు నగరంలోని వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. అమ్మవారి మాల ధారణ భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ పండితులు చిట్టిబాబు శర్మ అమ్మవారికి నూతన వస్త్ర ధారణతో అలంకరించి, పంచామృతాభిషేకాల చేపట్టిన అనంతరం దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం గుడి నుంచి నూకాంబిక ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చిన రథాన్ని భక్తులు లాగుతూ దేవీ నామస్మరణ చేశారు. సాయంత్రం అగ్నిగుండంలో నడిచి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దిగువ ఊర్వశి జంక్షన్ నుంచి కొండపైకి చేరే సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ వరకు వాహనరాకపోకలను మళ్లించి సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై డ్యాన్స్ ప్రదర్శనలు, ఆర్కెస్ట్రా కార్యక్రమాలు నిర్వహించారు. మార్చి 30వ తేదీ నుంచి ఆరంభమైన ఈ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి.

కంచపాలెం మెట్టు వద్ద ...


సాలిగ్రామపురం ఆలయం ఎదుట క్యూలో భక్తులు


అంకరణలో బర్మాకాలనీలో కొలువైన అమ్మవారు

కంచరపాలెం: కొత్తఅమావాస్య పర్వదినం సందర్భంగా కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో గల నూకాలమ్మ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కంచరపాలలెం గాంధీనగర్, గంగన్ననగర్, దేవేంద్రనగర్, రవీంద్రనగర్, తుమ్మడిపాలెం, రాంజీఎస్టేట్, అంబేదర్కర్ ఎస్టేట్ తదితర గ్రామాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రంభక్తులు అగ్నిగుండం ప్రవేశం చేశారు. ఘటాలు ఊరేగించారు.

అక్కయ్యపాలెం: సాలిగ్రామపురంలో నూకాంబిక మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ కన్వీనర్ తాడ జగజ్జీవన్‌రావు, అధ్యక్షుడు గంజి వెంకట రమణ, బండా వెంకట రమణ తగు ఏర్పాట్లు చేశారు. గత 28 ఏళ్ల నుంచి కొత్త అమావాస్య రోజు నూకాంబిక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎస్పీ


ఆర్అండ్‌బీ వద్ద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ లక్ష్మీనారాయణ

మర్రిపాలెం, ఏప్రిల్ 8: ఎన్నికలు నేపథ్యంలో సోమవారం ఉత్తర నియోజకవర్గం లోని పోలింగ్ బూత్‌లను ఎస్పీ లక్ష్మీ నారాయణ పోలీసు అధికా రులతో కలిసి సంద ర్శించారు. ఆర్అండ్‌బీ కార్యాలయం, జ్యోతినగర్ ప్రైమరీ స్కూల్‌తో పాటు పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని కోరారు. ఎస్పీతో పాటు ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ సీఐ చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు


బారులు వాహనాలు

జగదాంబ కూడలి, ఏప్రిల్ 8: ఉగాది సామ గ్రి కొనుగోలుదారుల రద్దీతో పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మెయిన్‌రోడ్డు అస్తవ్యస్త విస్తరణ పనులు, మరోవైపు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారుల అక్రమణలతో రాత్రి 7గంటల నుంచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంది.జగదాంబ నుంచి పాతపోస్టాఫీసుకు వెళ్లే ఆర్టీసీ బస్సులు వరుసగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. టూవీలర్స్, కార్లు రోడ్డుకు ఇరువైపులా విచ్చలవిడిగా నిలిపివేయడంతో మెయిన్ ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి పూర్ణామార్కెట్ బస్టాప్ వరకు రద్దీ నెలకొంది. వన్‌టౌన్‌ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణలో విఫలమయ్యారు.ప్రతీ పండగ సందర్భంగాపూర్ణామార్కెట్ లో ట్రాఫిక్ కష్టాలతోవాహనదారులు,పాదచారులు అవస్థలు పడాల్సి వస్తోంది. ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు పూర్తి దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థులకు ర్యాంకులు


INTSO అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య స్కూల్ ప్రతినిధులు

ల్యాప్ ట్యాప్‌లు సాధించిన విద్యార్థులో ఏజీఎం సురేశ్, అధ్యాపకులు

మహారాణిపేట, ఏప్రిల్ 8: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్ష ఫలితాల్లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించి రికార్డు సృష్టించినట్టు శ్రీ చైతన్య విద్యా సంస్థల ఉత్తరాంధ్ర ఏ జీఎం ఎంవీ సురేశ్ తెలిపారు. సోమవారం శ్రీ చైతన్య స్కూల్‌లో జరిగిన అభినందన సభ సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఐఎన్‌టీఎస్‌వో ఒలింపియాడ్‌లో ఉత్తరాంధ్ర జోన్ నుంచి అత్యధికంగా 22 మంది విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్‌లుగా ల్యాప్‌టాప్‌లు సాధించారని తెలిపారు. 30 మంది ట్యాబ్‌లు సాధించారన్నారు. 234 మంది విద్యార్థులు టాప్ 5 ర్యాంకులను కైవసం చేసుకున్నారన్నారు. ఈ ఫలితాల ద్వారా దేశంలో శ్రీ చైతన్య విద్యా సంస్థ నంబరు వన్‌గా మరోసారి నిరూపితమైందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు ఈ సమావే శంలో రీజనల్ ఇన్‌చార్జి అహ్మద్ ఆలీ, కోఆర్డినేటర్ రాజేష్ లంక, ప్రిన్సిపాల్ సూర్య నారాయణమూర్తి ,తదితరులు పాల్గొన్నారు.

యూసీడీ విభాగమా... వైసీపీ అనుబంధ సంఘమా?

- ఎన్నికల నిబంధనలకు పీడీ పాపునాయుడు తూట్లు
- జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

సీతంపేట, ఏప్రిల్ 8: జీవీఎంసీలోని అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగం అధికార వైసీపీకి అనుబంధ విభాగంగా మారిపోయిందని జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ నుంచి నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్‌పై యూసీడీ పీడీగా వచ్చిన పాపనాయుడు ఎన్నికల నిబంధనలను ఖాతరు చేయకుండా బరితెగించి వైసీపీ అభ్యర్థుల సేవల్లో మునిగితేలుతున్నారన్నారు. తాజాగా యూసీడీ రిసోర్స్ పర్సన్లు, పొదుపు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తమ పరిధిలోని మహిళల ఆధార్ కార్డు, ఓటు కార్డుల వివరాలను సేకరించి వెంటనే ఇవ్వాలంటూ యూసీడీ నుంచి ఆదేశాలు అందాయన్నారు. ఓటరు కార్డుల ఆధారంగా ఓటుకు రూ.వెయ్యి ఇచ్చేందుకు వైసీపీ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోందని ఆయన ఆరోపించారు. సమావేశంలో చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీవీఎస్ఎన్ రాజు, టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పొతన్న రెడ్డి, బంటు రవి పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా మైసూరు, భువనేశ్వర్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఏప్రిల్ 8: ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా మైసూరు, భువనేశ్వర్ మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 06215 నంబరు గల రైలు ఈనెల 9న ఉదయం 4.15 గంటలకు మైసూరులో బయలుదేరి మర్నాడు ఉదయం తెల్లవారుజాము 2.30 గంటలకు దువ్వాడ, 10.40 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది. తిరిగి రైలు ఈనెల 10న మధ్యాహ్నం 1.00 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, మర్నాడు రాత్రి 7.15 గంటలకు మైసూరు చేరుతుంది.

సంక్షేమ పథకాలకు కేరాఫ్ టీడీపీ

- పార్టీ జిల్లా అధ్యక్షులు గండిబాబ్జీ

మహారాణిపేట, ఏప్రిల్ 8: సంక్షేమ పథకాలకు పెట్టింది పేరు తెలుగు దేశం పార్టీ అని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గండిబాబ్జీ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.చంద్రబాబు నాయుడుకు ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల అనుభవం ఉందని, సంపద సృష్టించటం తెలుసునని అన్నారు. ప్రజా సంక్షేమం అంటే బటన్ నొక్కి డబ్బులు వేయడం మాత్రమే కాదని వైసీపీనుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. చంద్రబాబుపై నమ్మకంతో అమరావతి రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చినట్టు గుర్తు చేశారన్నారు. మూడు రాజధానులంటూ అమరావతిని ప్రస్తుతం పాలకులు నాశనం చేశారన్నారు. జగన్ జాబ్ క్యాలెండర్‌పేరిట యువతను మోసగించారన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని చంద్రబాబు ఆలోచనలో ఉన్నారన్నారు. సూపర్ 6 పేరుతో సంక్షేమ పథకాలను రూపొందించారన్నారు. విశాఖను డ్రగ్స్ గం జాయికు రాజధానిగా చేశారన్నారు. వైద్యరంగం నిర్వీర్యమైందన్నారు. రానున్న ఎన్నికలలో జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈసమావేశంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్ పాల్గొన్నారు.

కంప్యూటర్,టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కంచరపాలెం, ఏప్రిల్ 8: స్థానిక అశోక్‌నగర్‌లోని ఆంధ్ర బౌద్ధసంఘం ఆధ్వర్యంలో ఈనెల12వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఉచిత కంప్యూటర్, టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు బౌద్ధసంఘం ప్రధాన కార్యదర్శి కె. రాజు గణేశ్ పేర్కొన్నారు. నిరుపేదలకు సామాజిక సేవలో భాగంగా శిక్షణనిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి గల మహిళలు, విద్యార్థులు వివరాలకు 96760 30455 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తుది దశకు చేరిన రైల్వే ఫుట్‌బాల్ టోర్నీ


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 8: రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ స్టేడియంలో జరుగుతున్న వాల్తేరు డివిజన్ అంతర్ విభాగాల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ చివరి దశకు చేరింది. సోమవారం జరిగిన తొలి సెమీఫైనల్స్‌లో ఆపరేటింగ్ శాఖ 5-3 (టై బ్రేకర్స్) గోల్స్ తేడాతో కమర్షియల్ శాఖపై గెలుపొందింది. మరో సెమీస్‌లో క్యారేజ్ అండ్ వ్యాగన్స్ (సీ అండ్ డబ్ల్యు) 1-0 గోల్ తేడాతో రైల్వే ప్రొడక్షన్ ఫోర్సు (ఆర్పీఎఫ్)పై విజయం సాధించింది. ఫైనల్స్‌లో ఆపరేటింగ్, సీ అండ్ డబ్ల్యు జట్లు తలపడనున్నాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌లకు సీటీఐ-1 వేణుగోపాల్, భాను ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను అభినందించారు. రైల్వే ఫుట్‌బాల్ కార్యదర్శి శ్రీనివాస్, కోచ్‌లు తిరుమలరావు, గణేష్, వైశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 8: విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, మాజీ డిప్యూటీ మేయర్ సత్యనారాయణ పాల్గొని కళాకారులుఆర్.అప్పారావు, రమేష్, జాన్సీ, శితప్రసాద్, డేవిడ్‌రాజ్, నాగేశ్వరరావు, సందీప్‌లకు ఉగాది పురస్కారాలను అందజేశారు.

సీపీఎస్‌పైనా చేతులెత్తేశారు!

... 7వ పేజీ తరువాయి

తమ నెత్తిన మోపారని మండిపడ్డారు.

సీపీఎస్ ప్రకారం సర్వీస్‌లో చివరకు దాచుకున్న మొత్తంలో సగం ఉద్యోగి చేతికి ఇచ్చి, మిగిలిన సగంపై వచ్చే లాభమే పింఛన్‌గా వస్తుందని మరో టీచర్ వివరించారు.

జీపీఎస్ వల్ల ఉద్యోగి దాచుకున్న సొమ్ము మొత్తం ప్రభుత్వమే తీసుకుని దానిని పెట్టుబడుల్లో పెడితే వచ్చే లాభం పింఛన్‌గా తీసుకోవాలన్నారు. అంటే ఉద్యోగ విరమణ అనంతరం ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లిపోవడమేనన్నారు.

రక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించి...

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఫ్యామిలీ పింఛన్, గ్రాట్యుటీ ప్రయోజనం కల్పించారు. అయితే పాత విధానమే మేలని ఉద్యోగులు పట్టుబట్టారు. ఎస్‌పీ రక్కర్ కమిటీ ఆహ్వానించినా వెళ్లలేదు. ఈ దశలో పాదయాత్ర చేపట్టిన జగన్ సీపీఎస్ రద్దు హామీ ఇచ్చారు. జగన్ హామీ నిలబెట్టుకుంటారని నమ్మి రక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించామని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం మోసం చేస్తారని తాము భావించలేదని వాపోయారు. ప్రభుత్వమే మోసం చేయడంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల మంది ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు.

సీఎస్ఆర్ నిధులతో హాస్టళ్ల ఆధునికీకరణ

... 7వ పేజీ తరువాయి

ఆధునికీకరించారు. వీటిలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో పది, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని తొమ్మిది హాస్టళ్లు ఉన్నాయి. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పది వసతి గృహాలను రూ.4.15 కోట్లతో, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని తొమ్మిది వసతి గృహాలను రూ.4 కోట్లతో ఆధునికీకరించారు. దివీ స్, నిప్పాన్‌తోపాటు పలు ప్రముఖ పరిశ్రమలు ఈ నిధులను అందించాయి. అనేక వసతి గృహాల్లో బాత్ రూమ్‌లు, వాష్ రూమ్‌లు వంటి వాటిని మెరుగ్గా తీర్చి దిద్దారు. తాగునీటి ఇబ్బందులకు పరిష్కారాన్ని చూపించారు.

రైల్వే స్టేషన్‌లో కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

... 7వ పేజీ తరువాయి

పనులు చేయిస్తున్నారు. ప్రయాణికుల అవసరం కోసం హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటుచేశారు. 24 గంటల్లో పనులు పూర్తి చేసి, మూడు, నాలుగు ప్లాట్‌ఫారాల మధ్య కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వేయాలని కృషిచేస్తున్నారు. కాగా, పాదచారుల వంతెన కుంగడాన్ని రైల్వే అధికారులు సకాలంలో గుర్తించడంతో ప్రమాదం తప్పిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కలెక్టరేట్‌కు ఉద్యోగులు క్యూ

... 7వ పేజీ తరువాయి

డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారి (డీడీవో) తన పరిధిలో గల అధికారులు/ఉద్యోగుల వివరాలను కలెక్టరేట్‌కు పంపారు. ప్రసూతి సెలవుల్లో ఉన్నవారు, తీవ్రమైన అనారోగ్యానికి గురైన, మే నెలాఖరులోగా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను, ఇంట్లో మే నెల వరకూ శుభకార్యాలు ఉన్న ఉద్యోగులను ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇస్తారు. అయితే కొన్ని శాఖలకు సంబంధించి డీడీవోలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉద్యోగుల వివరాల సేకరణలో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. దీంతో జిల్లా యంత్రాంగం సీఎంఎఫ్ఎస్ ద్వారా జీతాలు తీసుకునే ఉద్యోగుల మొత్తం జాబితా తీసుకుంది. దానిని అనుసరించి ఎన్నికల విధులు కేటాయించాలని నిర్ణయించింది. వీరందరికీ ఈనెల 10, 12 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని కోరుతూ గడచిన ఐదారు రోజుల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఎన్నికలకు అవసరమైన సిబ్బంది నియామకం కోసం వీఎంఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ రవీంద్రను కలెక్టర్ మల్లికార్జున నియమించారు. కలెక్టర్‌కు వస్తున్న ఉద్యోగులు...ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరుతూ జాతీయ సమాచార కేంద్రంలో ఉంటున్న రవీంద్రను కలుస్తున్నారు. అయితే ప్రసూతి సెలవుల్లో ఉద్యోగినులకు, మే నెలాఖరు నాటికి పదవీ విరమణ చేస్తున్న, తీవ్ర అనారోగ్యం బాధపడుతున్న వారికి తప్ప మిగిలిన వారికి మినహాయింపు లేదని అధికారులు చెబుతున్నారు. ఇలా మినహాయింపులు ఇచ్చుకుంటూ పోతే ఎన్నికలు నిర్వహించలేమన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడే వారి పట్ల ఉదారంగా ఉంటాం తప్ప వైద్యుల నుంచి రిపోర్టులు తెస్తే పరిగణనలోకి తీసుకోలేమని స్పష్టంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారు తీసుకువచ్చే రిపోర్టుల పరిశీలనకు వైద్యులతో కమిటీని జిల్లా యంత్రాంగం ఏర్పాటుచేసింది. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కమిటీ నిర్ధారిస్తే ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఒకవేళ తప్పుడు రిపోర్టులు పెడితే చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

ఉగాది.. కొత్త ఆశలకు పునాది


భాగవతుల కృష్ణారావుని సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

సీతంపేట, ఏప్రిల్ 8: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ కవి సమ్మేళనం నిర్వహించారు. సభకు అధ్యక్షతన వహించిన సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఉగాది కవి సమ్మేళనంలో కవులు ఆశావాద దృక్పథంతో జనాలను చైతన్యపరచాలని కోరారు.ఆచార్య సార్వభౌమ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి క్రోధి నామ సంవత్సర ఫలితాలను, ఇతర అంశాలను విపులంగా వివరించారు. ఇందులో భాగంగా కవి, నటుడు భాగవతుల కృష్ణారావుని ఉగాది పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సీహెచ్ చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కవులు, రచయితలు పాల్గొన్నారు.

నేడు ఉగాది పురస్కారాల ప్రదానం

మహారాణిపేట, ఏప్రిల్ 7: ఉడా చిల్డ్రన్ ఎరీనాలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించనున్నట్టు డీఆర్‌వో కే మోహన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, అధికారులు శ్రీనివాసఫణి, కే శిరీష, డీ జయదేవి తదితరులు పాల్గొన్నారు. ఆరుగురు వేదపండితులకు ఉగాది పురస్కారాలు అందిస్తామని దేవదాయ సహాయ కమిషనర్ కె. శిరీష తెలిపారు. అనంత వెంకట వరహా కృష్ణమాచార్యులు, శ్రీమతి బీ బుచ్చమ్మ, వీ నరసింహాచార్యులు, కొడమంచలి శ్రీనివాస శర్మ, కోటా పంచముఖి శర్మ తదితరులను ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్టు వివరించారు.

మురళీనగర్; విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించనున్న ఉగాది పండగకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొత్తఏడాది రోజు స్వామికి ప్రత్యేక సుప్రభాత సేవల అనంతరం మందిరంలో ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. సాయంత్రం ఆలయంలో పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ ఈవో బండారు.ప్రసాద్ తెలిపారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు

డాబాగార్డెన్స్: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరి ప్రసంగించారు. మన జీవితంలో జరిగే సంఘటనలు అన్నీ కూడా ఉగాది పర్వదినంతో ముడిపడి ఉంటాయన్నారు. ఇందులో భాగంగా తీపి,కారం, చేదు ఇలా అన్నీ కూడా సమపాళల్లో మిళితం చేసి ఉగాది పచ్చడి చేస్తారన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి సత్యవతి, గంట్ల శ్రీనుబాబు, ఆర్.నాగరాజు పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉగాది ప్రసాద సామగ్రిని పంపిణీ చేశారు.



రూ.6 వేలు పింఛన్ ప్రకటనపై హర్షం

మహారాణిపేట, ఏప్రిల్ 8: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే విభిన్న ప్రతిభావంతులకు రూ.6 వేల పెన్షన్‌ఇస్తామని చంద్రబాబు ప్రకటనపై దివ్యాంగుల కమిటీ అధ్యక్షుడు ఈసారపు వాసు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం దివ్యాంగులను విస్మరించిందన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి విజయం సాధించిన తర్వాత దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈకార్య క్రమంలో జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాస గౌడ్, శీరం త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి చీరలు పంపిణీ

పూర్ణామార్కెట్, ఏప్రిల్ 8: రంజాన్ పురస్కరించుకొని జీవీఎంసీ పారిశుధ్య మహిళలకు వివేకానందసేవా సమితి గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ చీరలు పంపిణీ చేశారు. ఏటా రంజాన్ పర్వదినాల్లో 39వ వార్డు పరిధిలో పారిశుధ్య పనులు చేస్తున్న మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. వారి సేవలను ఆయన అభినందించారు. రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుడు మక్సద్ అహమ్మద్, వివేకానంద సేవా సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సత్తిబాబు, సభ్యులుపాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌తో ఉషాకిరణ్ భేటీ

మర్రిపాలెం, ఏప్రిల్ 8: అనకాపల్లి పర్యటనకు విచ్చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను విశాఖ ఉత్తర నియోజకవర్గ ఆ పార్టీ కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కూటమి అభ్యర్థులు విజయానికి కృషి చేయాలని పవన్‌కల్యాణ్ సూచించారు.

సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఈపీడీసీఎల్ జీఎం .తిలక్ తదితరులు

కంచరపాలెం, ఏప్రిల్ 8 : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీఈడీపీసీఎల్ జనరల్ మేనేజర్ కె.తిలక్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సాంకేతిక నైపుణ్యంతో పాటు సామాజిక అవగాహన,పరిపాలనా నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు మాట్లాడుతు త్వరలో కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డా.కెఎన్ఎస్.ప్రకాశరావు,డా, కెవీ రమణ,డా.ఎన్,చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నంబిసైన్ నవలల అధ్యయనంపై పీహెచ్‌డీ ప్రదానం

డాబాగార్డెన్స్, ఏప్రిల్ 8: ఆంగ్ల రచయిత్రి కావేరి నంబిసైన్ రాసిన నవలలపై ఆచార్య ప్రసన్న మార్గదర్శనంలో చేసిన అధ్యయనానికి గాను పీహెచ్‌డీ పట్టాను ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతులమీదుగా సోమవారం చొక్కాకుల జగదీశ్వరీ స్వీకరించారు. ఈ సందర్భంగా వీసీ ఆమెను అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయండి

భీమిలి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

ఆనందపురం, ఏప్రిల్ 8 : భీమిలి నియోజకవర్గంలో టీడీపీ గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం పెద్దిపాలెం సమీపంలో ఉన్న చెన్నా కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సర్వనాశనం చేసిందన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను కూడా పక్కాగా అమలు చేయలేని దుస్థితిలో ఉందన్నారు. నాయకుల మధ్య ఉన్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకుని తనను లక్ష మెజార్టీతో గెలిపించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. 10న అన్నవరం గ్రామం నుంచి ప్రచారం ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి, మాజీ మంత్రి అప్పలనరసింహరాజు, జనసేన, భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, కంటుభక్త రామానాయుడు, మేడపాటి రవీంద్ర, కర్రి సీతారామ్ పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

కొమ్మాది : జీవీఎంసీ 5వ వార్డు పార్టీ కార్యాలయంలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ కాలనీ, మారికవలస రాజీవ్‌గృహ కల్ప, ఎన్‌టీఆర్ హుద్‌హుద్ కాలనీ, పిపి 2 కాలనీ, స్వతంత్రనగర్, సాయిరాం కాలనీ ప్రాంతాలకుచెందిన 500 మంది టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి హేమలత, బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, నాయకులు వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, మన్యాల సోంబాబు, బోయి వెంకటరమణ, బోయి రమాదేవి, నమ్మి శ్రీను, లంక రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


గంటాను కలిసిన ఎమ్మెల్యే వెలగపూడి

గంటాను కలిసిన తూర్పు, చోడవరం అభ్యర్థులు

సిరిపురం : భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావును ఆయన నివాసంలో తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, చోడవరం అభ్యర్థి రాజు సోమవారం కలిసారు. వెలగపూడి గంటాను ఓటు కోసం అభ్యర్థించారు. అనంతరం ఇద్దరూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. చోడవరం మండలం ముద్దుర్తి సర్పంచు, మరో ఐదుగురు సర్పంచులు బుధవారం టీడీపీలో చేరుతుండడంతో ఆ కార్యక్రమానికి రాజు గంటాను ఆహ్వానించారు.


స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న ముత్తంశెట్టి

ఒకటో వార్డులో ముత్తంశెట్టి ప్రచారం

తగరపువలస, ఏప్రిల్ 8 : భీమిలి వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం ఒకటో వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి, వైసీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తనకు మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. ఎన్నికల తర్వాత ఎక్కడో ఉండి ఇన్‌చార్జిల ద్వారా పాలన చేయడం తనకు చేతకాదని చెప్పారు. సోషల్ మీడియాలో ఇతరులు చేసే తప్పుడు ప్రచారాలను నమ్మనవరం లేదన్నారు. గతంలో ఒక నియోజకవర్గానికి నాలుగు కోట్లు మాత్రమే నిధులు విడుదల చేసేవారని, కానీ ఇప్పుడు వందల కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎ. రామునాయుడు జె. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


రోడ్ షోలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు


చిరువ్యాపారులతో ఎమ్మెల్యే వెలగపూడి

'టీడీపీ పాలనతోనే బీసీలకు రక్షణ'

ఎంవీపీ కాలనీ, ఏప్రిల్ 8 : టీడీపీ పాలనతోనే బీసీలకు రక్షణ సముచిత స్థానం లభిస్తాయని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. సోమవారం ఆయన ఎంవీపీ నాలుగో సెక్టరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం చిరు వ్యాపారులతో పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు, హిందీ పండిట్‌లకు సత్కారం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 8 : జిల్లాలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న తెలుగు, హిందీ పండిట్‌లను విశాఖలోని పదో తరగతి పరీక్షల మూల్యాంకనం కేంద్రంలో సోమవారం ఘనంగా సత్క రించారు. రాష్ట్రీయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్,డీఈఓ చంద్రకళ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా ఉపాధ్యాయులు ఈనెలలో పదవీ విరమణ చేయనుండడంతో సత్కరించినట్టు నిర్వాహకులు తెలిపారు. సత్కానం పొందిన వారిలో శ్రీనివాసరావు (వేపాడ), పద్మావతి (తోటగరువు), ఎస్ఎస్ లక్ష్మి (చంద్రంపాలెం), పరిపూర్ణ (ఎండాడ), మున్నాబేగం (ఆనందపురం), కుసుమకుమారి (గుర్రంపాలెం) ఉన్నారు.

ఘనంగా గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం

కొమ్మాది, ఏప్రిల్ 8 : విద్యార్థులు చదువుతో పాటు సంగీతంలోనూ రాణించాలని సంగీత నాటక అవార్డు గ్రహీత మంద సుధారాణి అన్నారు. సోమవారం ఆమె గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్) వార్షికోత్సవంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు నూతన టెక్నాలజీ ఉపయోగించుకుని కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఆచార్య సోమరాజు, ప్రిన్సిపాల్ రావ్, డీన్‌లు హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో సమావేశం

పద్మనాభం, ఏప్రిల్ 8 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దారు వెంకటరావు ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు.

ఉపాధ్యాయులతో ఆర్‌జేడీ సమావేశం

ఆరిలోవ, ఏప్రిల్ 8 : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ భాస్కరరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై సూచనలు ఇచ్చారు. సమావేశంలో హెచ్‌ఎం దుర్గా భవానీ, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఏప్రిల్ 8 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములతో శ్రీకారం చుట్టి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు.

అర్రెమ్మ మృతి పట్ల నివాళి

భీమునిపట్నం, ఏప్రిల్ 8 : కాంగ్రెస్ పార్టీ సీనియరు నాయకురాలు, వైసీపీ మహిళా నాయకురాలు అల్లిపిల్లి అర్రెమ్మ (65) సోమవారం ఆమె తన నివాసంలో మృతి చెందారు. ఎగువపేటకు చెందిన ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 40 ఏళ్ల పాటు ప్రజల మధ్య ఉంటూ సమస్యలపై పోరాటం చేసేవారు. ఆమె మృతి పట్ల పట్టణ నాయకులు ఎల్లాజీ (రంగ), అల్లిపిల్లి నర్సింగరావు, షైలపల్లి షణ్ముఖరావు, గంటా నూకరాజు, వాసుపల్లి కొండబాబు, అల్లిపిల్లి వేణు సంతాపం వ్యక్తం చేశారు.

నిత్యావసర వస్తువులు వితరణ

పెదవాల్తేరు, ఏప్రిల్ 8 : పెదవాల్తేరులోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలకు విన్నర్ వెల్ క్లబ్ వాల్తేరు సభ్యులు సోమవారం నిత్యావసర వస్తువులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రత్నం, అనూష, శోభారాణి, రాజేశ్వరి, శ్రీదేవి, చార్టెడ్ అకౌంటెంట్ జగన్నాథం, మానసిక దివ్యాంగుల పాఠశాల వ్యవస్థాపకుడు కండిపిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE X ADDITIONAL DISTRICT JUDGE AT ANAKAPALLI
M.O.P. No.385/23

Between
Pothala Krishnaveni & 2 others
(The 2nd petitioner being minor R/b his mother i.e., 1st petitioner) ...Petitioners
And
Golagani Govinda Rao & 2 other ...Respondents

NOTICE

To
R-3: TATA AIG General Insurance Company Ltd., R/B it's legal manager, Branch Office, Near Sampath Vinayaka Temple, Visakhapatnam. (The insurer of the motorcycle bearing No. AP31 TE 8133 bearing policy No. VPVC0391037400010 is valid from 05-03-2022 to 04-03-2023)

Please take notice that the above named petitioner have instituted the above petition against you for compensation with interest and costs. You are hereby summoned to appear before the court in person or through advocate duly instructed and able to answer all material questions relating to the above petition on **11-04-2024 at 10-30 A.M.,** in default of your appearance on that day, the matter will be heard and decided in your absence.

(By order of Honourable Court of the X Additional District Judge at Anakapalli)

BETINA SRINIVAS, Advocate
Anakapalli

వైభవంగా నూకాంబిక జాతర

వెంకోజీపాలెం, ఏప్రిల్ 8 : కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ఉన్న కాలభైరవునికి కొత్త అమావాస్య పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు బోర రమణరెడ్డి, ఎర్రాజీ రెడ్డి, గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు. అలాగే 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో ఉన్న నూకాలమ్మ తల్లి జాతర (అనుపు మహోత్సవం) కూడా వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ బుగత సత్యనారాయణ, కమిటీ సభ్యులు తొలి పూజ నిర్వహించుకున్నారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ ప్రధానార్చకుడు డి. వెంకటరత్నం శర్మ భక్తుల గోత్ర నామాలతో అమ్మవారికి విశేషంగా పూజలు జరిపారు. ఎంపీ, తూర్పు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావు, తదితరులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని శతకం పట్టు (పుట్టినిల్లు) నుంచి ఊరేగించారు. సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కాగా భక్తులకు సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు పడాల గోవింద్, ఆటో యూనియన్ నాయకులు గ్లూకోజ్ పంపిణీ చేశారు.


పాత డెయిరీ ఫారంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

ఆరిలోవ : పాత డెయిరీ ఫారం చినగదిలి తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న నూకాంబిక అమ్మవారి జాతర సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషే కాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు. చినగదిలి తహసీల్దార్ శివన్నారాయణ, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.16న మారు వారం పండుగ సందర్భంగా ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించను న్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. పాత ఆరిలోవలోనూ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. తెల్లజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల వద్ద ఎటువంటి అల్లర్లు జరగకుండా సీఐ గోవిందరాజు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

సింహాచలం : అడివివరంలో కొలువుదీరి ఉన్న భైరవ స్వామికి భక్తులు పూజలు జరిపారు. వేకువజాము నుండే ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, చత్తీస్‌ఘడ్ సరిహద్దు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించారు.

కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే తీవ్ర పరిణామాలు

ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు రామచంద్రరావు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 8: కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని ఇంటక్ స్టీల్‌ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అన్నారు. ప్లాంట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా యాజమాన్యం, గుర్తింపు సంఘం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వేతన సవరణపై తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. కార్మిక సమస్యలపై ఉక్కు యాజమాన్యం స్పందించకపోతే పోరాటాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారు రమణ, టీఎంకే నాయక్, ఎస్‌పి నాయుడు, మొల్లి ఈశ్వరరావు, మంత్రి గోపీనారాయణ, సుదర్శనం, మోహన్, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌పి నగర్‌లో పూజలందుకున్న నూకాలమ్మ



గోపాలపట్నంలోని ఆలయం వద్ద నూకాంబిక దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

పాహిమాం నూకాంబిక

కొత్త అమావాస్య సందర్భంగా పలు ప్రాంతాల్లో వైభవంగా అమ్మవారి పండుగ

ఆయా ఆలయాల వద్ద వేకువజాము నుంచే బారులుతీరిన భక్తులు

గోపాలపట్నం, ఏప్రిల్ 8: కొత్త అమావాస్య సందర్భంగా పలు ప్రాంతాల్లో నూకాంబిక పండుగను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గోపాలపట్నం, కొత్తపాలెం, అప్పలనరసింహ కాలనీ, వెంకటాపురం ప్రాంతాల్లో అమ్మవారిని దర్శించేందుకు వేకువ జాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోపాలపట్నం కూడలిలోని ఆలయంలో నూకాంబికను దర్శించేందుకు జనం బారులుతీరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు వాటిల్లకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలో సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక్కడి పద్మనాభనగర్‌లోని నూకాలమ్మ ఆలయంలో జరిగిన పూజాది కార్యక్రమాల్లో వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక పరిసర ప్రాంతాల్లో ఉన్న నూకాంబిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం నుంచే ఆయా ఆలయాలకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణాల్లో సాంస్కృతిక ఏర్పాటు చేసిన కార్యక్రమాలు అలరించాయి.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్‌లో నూకాంబికకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, జరిపారు. అమ్మవారిని దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు. అశోక్‌నగర్, కొత్తదిబ్బపాలెం, ప్రియదర్శనీ కాలనీ, సంజీవగిరి కాలనీ, గిరిజా కాలనీ, వాంబే కాలనీలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఉగాది సందర్భంగా మంగళవారం కూడా నూకాంబికకు ప్రత్యేక పూజలు జరుపుతామని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని తెలుగుదేశం కాలనీ, ఏకేసీ కాలనీ, మాజీ సైనికుల కాలనీ, బర్మా కాలనీ, కోడిపందెల దిబ్బ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. ఏకేసీ కాలనీలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, వైఎస్సార్‌టీయూసీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ కె.బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి దుగ్గపువానిపాలెం, వడ్లపూడిల్లోని నూకాంబిక ఆలయాల్లో మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అమ్మవార్లను నూతన వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. దుగ్గపువానిపాలెంలో నూకాంబికను కార్పొరేటర్ బొండా జగన్, సింహాద్రి ప్రాపర్టీస్ ఛైర్మన్ సిగిలిపల్లి రవి, కవిత, తదితరులు దర్శించుకున్నారు. అలాగే కణితి గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నూకాలమ్మ పండుగను నిర్వహించారు. 71వ వార్డు పరిధిలోని శ్రీనగర్, పాతకర్ణవానిపాలెంలో, కుంచుమాంబ ఆలయంలో, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో, శ్రామికనగర్, ఎల్‌వీనగర్, చిట్టినాయుడు కాలనీ, చట్టివానిపాలెంలలో నూకాలమ్మ ఆలయంలో, డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పద్మనాభనగర్‌లో నూకాంబిక సన్నిధిలో ఆడారి ఆనంద్‌కుమార్, తదితరులు



పెందుర్తిలో ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు



ప్రహ్లాదపురంలో చెరకుతో అలంకరించిన నూకాంబిక

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి పాత అగనంపూడిలో నూకాంబిక అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని సుందరమయంగా అలంకరించగా గ్రామ పెద్దలు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధనను చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, ఆలయ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, కె.సత్యారావు, కె.జగదీశ్, ఎం.నరసింగరావు, జి.రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే శనివాడలోని నూకాంబిక ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి అనుపోత్సవాన్ని చేపట్టారు.

పెందుర్తి: ఇక్కడి సంతబయలు ప్రాంతంలోని నూకాంబిక ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారికి చీరలు, పసుపుకుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అలాగే సరిపల్లిలో నూకాంబిక జాతర సందర్భంగా ఘటాలను ఊరేగించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పెందుర్తి-రూరల్: మండలంలోని పెదగాడి, పినగాడి, చింతల అగ్రహారం, గవరపాలెం, దుర్గానగర్, లక్ష్మీపురం, చీమలాపల్లి, పొర్లుపాలెం, పురుషోత్తపురం గ్రామాల్లో నూకాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ఘటాలతో ఊరేగింపు చేపట్టారు. గవరపాలెం బస్టాండ్ కూడలిలో స్థానిక కళాకారులు ప్రదర్శించిన పగ-ప్రతీకారం సాంఘిక నాటకం చూపరులను ఆకట్టుకుంది.

అక్కిరెడ్డిపాలెం: ఇక్కడి నూకాంబిక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పసుపుకుంకుమలతో పాటు చీరలను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ గుడివాడ అనూష, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, గుడివాడ లతీశ్, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వేపగుంట: ఇక్కడి ప్రహ్లాదపురంలో నూకాంబిక అమ్మవారిని చెరకు గడలతో చేపట్టిన అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెందుర్తి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, కార్పొరేటర్ రాపర్తి కన్నా అమ్మవారి దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. నాయుడుతోట గుడివీధిలో నూకాలమ్మ పుట్ట వద్ద భక్తులతో పాటు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పూజలు జరిపారు. గొల్లనారాయణపురంలోని నూకాలమ్మ ఆలయంలో, నాయుడుతోట గంగిరెడ్డి కాలనీలో, వరలక్ష్మీనగర్‌లోని నూకాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

ఎన్.ఎ.డి. జంక్షన్: జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురంలోని నూకాలమ్మ ఆలయంలో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

రైల్వే స్టేషన్‌లో కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి

... 7వ పేజీ తరువాయి

పనులు చేయిస్తున్నారు. ప్రయాణికుల అవసరం కోసం హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటుచేశారు. 24 గంటల్లో పనులు పూర్తి చేసి, మూడు, నాలుగు ప్లాట్‌ఫారాల మధ్య కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వేయాలని కృషిచేస్తున్నారు. కాగా, పాదచారుల వంతెన కుంగడాన్ని రైల్వే అధికారులు సకాలంలో గుర్తించడంతో ప్రమాదం తప్పిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'కేంద్ర ప్రభుత్వ కుట్రలను పోరాటాలతో తిప్పికొట్టాలి'

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 8: విశాఖ ఉక్కు కర్మాగారానికి రావాల్సిన ముడిఖనిజమైన బొగ్గును ఆపి స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఐక్య పోరాటాలతో కార్మికులంతా తిప్పికొట్టాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,152వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు శతాబ్దాలుగా పాలక పక్షం చేసిన అప్పులు కంటే ఇప్పటి ప్రభుత్వాలు మూడు రెట్లు అధికంగా చేశాయని విమర్శించారు. శ్రమ దోపిడీని నివారించడానికి ఉద్యమాలే శరణ్యమన్నారు. మరో ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారిశ్రామికాభివృద్ధి అధోగతిపాలైందన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో ఉక్కు ప్రైవేటీకరణ అంశంపై చర్చించి, ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకునేంత వరకు తాము తగ్గేదే లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సీపీఎస్‌పైనా చేతులెత్తేశారు!

... 7వ పేజీ తరువాయి

తమ నెత్తిన మోపారని మండిపడ్డారు. సీపీఎస్ ప్రకారం సర్వీస్‌లో చివరకు దాచుకున్న మొత్తంలో సగం ఉద్యోగి చేతికి ఇచ్చి, మిగిలిన సగంపై వచ్చే లాభమే పింఛన్‌గా వస్తుందని మరో టీచర్ వివరించారు.

జీపీఎస్ వల్ల ఉద్యోగి దాచుకున్న సొమ్ము మొత్తం ప్రభుత్వమే తీసుకుని దానిని పెట్టుబడుల్లో పెడితే వచ్చే లాభం పింఛన్‌గా తీసుకోవాలన్నారు. అంటే ఉద్యోగ విరమణ అనంతరం ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లిపోవడమేనన్నారు.

టక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించి...

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఫ్యామిలీ పింఛన్, గ్రాట్యుటీ ప్రయోజనం కల్పించారు. అయితే పాత విధానమే మేలని ఉద్యోగులు పట్టుబట్టారు. ఎస్‌పీ టక్కర్ కమిటీ ఆహ్వానించినా వెళ్లలేదు. ఈ దశలో పాదయాత్ర చేపట్టిన జగన్ సీపీఎస్ రద్దు హామీ ఇచ్చారు. జగన్ హామీ నిలబెట్టుకుంటారని నమ్మి టక్కర్ ఆహ్వానాన్ని తిరస్కరించామని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం మోసం చేస్తారని తాము భావించలేదని వాపోయారు. ప్రభుత్వమే మోసం చేయడంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల మంది ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు.

సీఎస్ఆర్ నిధులతో హాస్టళ్ల ఆధునికీకరణ

... 7వ పేజీ తరువాయి

ఆధునికీకరించారు. వీటిలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో పది, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని తొమ్మిది హాస్టళ్లు ఉన్నాయి. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని పది వసతి గృహాలను రూ.4.15 కోట్లతో, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని తొమ్మిది వసతి గృహాలను నాలుగు కోట్ల రూపాయలతో ఆధునికీకరించారు. దివీస్, నిప్పాన్‌తోపాటు పలు ప్రముఖ పరిశ్రమలు ఈ నిధులను అందించాయి.

అనేక వసతి గృహాల్లో బాత్ రూమ్‌లు, వాష్ రూమ్‌లు వంటి వాటిని మెరుగ్గా తీర్చి దిద్దారు. తాగునీటి ఇబ్బందులకు పరిష్కారాన్ని చూపించారు.

కలెక్టరేట్‌కు ఉద్యోగులు క్యూ

... 7వ పేజీ తరువాయి

డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారి (డీడీవో) తన పరిధిలో గల అధికారులు/ఉద్యోగుల వివరాలను కలెక్టరేట్‌కు పంపారు. ప్రసూతి సెలవుల్లో ఉన్నవారు, తీవ్రమైన అనారోగ్యానికి గురైన, మే నెలాఖరులోగా పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను, ఇంట్లో మే నెల వరకూ శుభకార్యాలు ఉన్న ఉద్యోగులను ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇస్తారు. అయితే కొన్ని శాఖలకు సంబంధించి డీడీవోలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఉద్యోగుల వివరాల సేకరణలో కొన్ని ఇబ్బందులు వచ్చాయి. దీంతో జిల్లా యంత్రాంగం సీఎంఎఫ్ఎస్ ద్వారా జీతాలు తీసుకునే ఉద్యోగుల మొత్తం జాబితా తీసుకుంది. దానిని అనుసరించి ఎన్నికల విధులు కేటాయించాలని నిర్ణయించింది. వీరందరికీ ఈనెల 10, 12 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

ఈ నేపథ్యంలో ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని కోరుతూ గడచిన ఐదారు రోజుల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఎన్నికలకు అవసరమైన సిబ్బంది నియామకం కోసం వీఎంఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ రవీంద్రను కలెక్టర్ మల్లికార్జున నియమించారు. కలెక్టర్‌కు వస్తున్న ఉద్యోగులు...ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరుతూ జాతీయ సమాచార కేంద్రంలో ఉంటున్న రవీంద్రను కలుస్తున్నారు. అయితే ప్రసూతి సెలవుల్లో ఉద్యోగినులకు, మే నెలాఖరు నాటికి పదవీ విరమణ చేస్తున్న, తీవ్ర అనారోగ్యం బాధపడుతున్న వారికి తప్ప మిగిలిన వారికి మినహాయింపు లేదని అధికారులు చెబుతున్నారు. ఇలా మినహాయింపులు ఇచ్చుకుంటూ పోతే ఎన్నికలు నిర్వహించలేమన్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడే వారి పట్ల ఉదారంగా ఉంటాం తప్ప వైద్యుల నుంచి రిపోర్టులు తెస్తే పరిగణనలోకి తీసుకోలేమని స్పష్టంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారు తీసుకువచ్చే రిపోర్టుల పరిశీలనకు వైద్యులతో కమిటీని జిల్లా యంత్రాంగం ఏర్పాటుచేసింది. తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కమిటీ నిర్ధారిస్తే ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఒకవేళ తప్పుడు రిపోర్టులు పెడితే చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

'క్రీడాకారులకు వసతులను దూరం చేస్తున్న వైసీపీ'

గాజువాక, ఏప్రిల్ 8: క్రీడాకారులకు వైసీపీ ప్రభుత్వం సౌకర్యాలను దూరం చేస్తుందని టీడీపీ గాజువాక నియోజకవర్గ కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. 73వ వార్డు పరిధిలోని ఆదర్శ మైదానంలో జరుగుతున్న నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఏడెకరాల స్థలంలో గల ఆదర్శ మైదానంలో ఒక ప్రణాళిక లేకుండా, ప్రజాభీష్టం లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు సాగిస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలగ బాలునాయుడు, సిరసపల్లి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలి

అగనంపూడి, ఏప్రిల్ 8: ఓటు హక్కు లేని అర్హులందరూ తక్షణమే నమోదు చేసుకోవాలని టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర కోరారు. టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఓటు హక్కు నమోదుకు ఈ నెల 15 వరకు గడువు ఉన్నందున అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంతకోరు అప్పారావు, డొక్కా రమేశ్, బి.చందూరమేశ్, పి.అచ్యుత్, కె.తిలక్, కె.రమణ, వి.రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు కేంద్రంలో టీడీపీ నాయకులు

పాత చెక్ పోస్టు ఏరియా పేరు మార్పు

మల్కాపురం, ఏప్రిల్ 8: బ్రిటిష్ కాలంలో ఆ గ్రామానికి పాత చెక్ పోస్టు ఏరియా అని నామకరణం చేయగా.. అది ఇప్పటికీ కొనసాగుతూ వచ్చింది. అయితే తాజాగా ఆ పేరును మార్చు చేయాలని యువత నడుం బిగించింది. దీంతో పాత చెక్ పోస్టు ఏరియా పేరును కాస్త శ్రీకృష్ణ సాయినగర్‌గా మార్చారు. ఈ మేరకు శిలాఫలకాన్ని, నేమ్ బోర్డును ఇక్కడ ఏర్పాటు చేశారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఏప్రిల్ 8 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో సింహాద్రి అప్పన్న స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో శ్రీకారం చుట్టి షోడశోపచారాలు సమర్పించారు.

అనంతరం నృసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు.



పీఠాధిపతి ఆశీసులు తీసుకుంటున్న మంత్రి రోజా

శారదాపీఠాన్ని సందర్శించిన మంత్రి రోజా

పెందుర్తి, ఏప్రిల్ 8: రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్కే.రోజా సోమవారం చినముషిడివాడలోని శారదాపీఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పీఠం అధిష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రాంగణంలోని దేవతామూర్తులకు పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని కలిసి ఆయన ఆశీసులు తీసుకున్నారు. నగరిలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు విజయం చేకూర్చాలని పీఠాన్ని సందర్శించి పూజలు చేసినట్టు రోజా తెలిపారు. అంతకుముందు ఆమెకు పీఠం శ్రీకార్యం సంప్రదాయకంగా స్వాగతం పలికింది.

నేడు దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఏప్రిల్ 8: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలెం గ్రామస్థుల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధనను చేపడుతున్నామన్నారు.

ఏపీఐఐసీ స్థలాలను ఆక్రమిస్తే ఊరుకోం

డీజెడ్ఎం జయబాబు

ఆటోనగర్, ఏప్రిల్ 8: ఏపీఐఐసీ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు చేపడతామని డీజెడ్ఎం జయబాబు హెచ్చరించారు. 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో సర్వే నంబర్-118లో ఏపీఐఐసీ స్థలంలో బహుళ అంతస్థుల నిర్మాణం జరుగుతుంది. ఇది ఏపీఐఐసీకు చెందిన స్థలమంటూ పలుమార్లు అధికారులు నోటీసులు ఇచ్చినా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో సదరు యజమాని భవనాన్ని నిర్మించుకుంటూ పోతున్నారు. ఈ నేపథ్యంలో ఫిర్యాదులు అధికమవ్వడంతో ఏపీఐఐసీ డీజెడ్ఎం జయబాబు, ఐలా కమిషనర్ కె.జయచంద్రలు సిబ్బందితో కలిసి సోమవారం ఆ భవంతి వద్దకు చేరుకుని భవన యజమానికి మందలించడంతో పాటు ఇది ఏపీఐఐసీకు చెందిన ప్రభుత్వ స్థలం అంటూ బోర్డును పెట్టారు. ఈ భవనంలో ఎవరూ ఫ్లాట్లు కొనుగోలు చేయరాదని, ఒకవేళ కొన్నా ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టినందున చట్టరీత్యా తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని జయబాబు పేర్కొన్నారు. అనంతరం వారు ఆటోనగర్ ఈ-బ్లాక్‌లో ఏపీఐఐసీ గ్రీన్‌బెల్ట్ స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఏపీఐఐసీ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్టు తెలుసుకుని అక్కడకు చేరుకుని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జూనియర్ మేనేజర్ వై.రాంబాబు, ఏఈ అవినాశ్, ఐలా సిబ్బంది ఒమ్మి నాయుడు, టి.చిరంజీవి, జి.శ్రీనివాసరావు, పల్లా సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టేందుకు జీవీఎంసీ అధికారులు ఏ విధంగా ప్లాన్‌లు మంజూరు చేస్తున్నారో అర్థం కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



శ్రీనగర్‌లో ఏపీఐఐసీ భూమిలో నిర్మితమవుతున్న భవనం వద్ద బోర్డు పెట్టిన అధికారులు, సిబ్బంది

అంధుల ఆశ్రమానికి చేయూత

మల్కాపురం, ఏప్రిల్ 8: మల్కాపురం ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త, సంఘ సేవకుడు చెల్లూరి భాస్కరరావు (ఆర్టిస్ట్) ఆధ్వర్యంలో పాత గాజువాక ప్రాంతానికి చెందిన క్లస్టర్ నివాసితులు తొట్లకొండ ప్రాంతానికి చెందిన నేత్రాలయ వారిజ ఆశ్రమంలోని అంధుల కోసం రూ.ఐదు లక్షల విలువ చేసే సామగ్రిని అందజేశారు. ఐదు ర్యాకులు, ఒక ప్రింటర్, ఆరు ఫ్యాన్లు, మూడు వేల పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా క్లస్టర్ నివాసితులకు భాస్కరరావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మరిన్ని స్వచ్ఛంద సంస్థలు అభాగ్యులకు సేవ చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

ఆటో అపహరణపై ఫిర్యాదు

వేపగుంట ఏప్రిల్ 8: నాయుడుతోట జంక్షన్‌లో ఆదివారం రాత్రి పార్కింగ్ చేసిన ఆటోను దొంగలు అపహరించారు. నాయుడు తోట బంటాకాలనీలో ఉంటున్న రొంగళి సతీశ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 10 గంటలప్పుడు ఏపీ31 టీ4 0890 నంబరు గల ఆటోను నాయుడుతోట జంక్షన్‌లో నిలిపి భీమిలిలోని పండగకు వేరే వాహనంలో వెళ్లాడు. తెల్లవారుజామున వచ్చేసరికి ఆటో లేదు. పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు గోపాలపట్నం వైపు తరలించినట్టు ఉంది. దీంతో పెందుర్తి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.